
సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం, 7, అక్టోబర్, 2023



గ్యాస్ లీకై అస్వస్థత

ఐస్ ఫ్యాక్టరీని తొలగిస్తుండగా గ్యాస్ లీకై పక్కనే ఉన్న రొయ్యల ఫ్యాక్టరీలోని మహిళా కార్మికులు అస్వస్థతకు గురైన సంఘటన కోవల్లెలో చోటుచేసుకుంది. 8లో ▸



విద్యుత్ సరఫరాలో నెం.1

నాణ్యమైన విద్యుత్ సరఫరాలో ఏపీఈపీడీసీఎల్ ముందంజలో నిలుస్తోంది. సరఫరాలో లోపాలను ఎప్పటికప్పుడు సరిచేస్తూ అంతరాయాలను తగ్గిస్తోంది. 8లో ▸

డీఆర్వోగా వెంకటేశ్వర్లు



ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారిగా ఎం.వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. గతంలో వెంకటేశ్వర్లు కృష్ణా జిల్లా డీఆర్వోగా పనిచేశారు.

న్యూస్‌రీల్

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : డీఐజీ



ఏలూరు రూరల్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఏలూరు డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలలో పోలీసుశాఖ ఆద్వర్యంలో మాదక ద్రవ్యాల అలవాట్లు, కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఐజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాలను అడ్డుకునేందుకు పోలీసు, ఎక్సైజ్‌శాఖను విలీనం చేస్తూ ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా రాష్ట్ర సరిహద్దు అటవీ ప్రాంతాల నుంచి తరలిస్తున్న గంజాయి ముఠాలపై కఠిన చర్యలు చేపట్టామన్నారు. గంజాయి పండించే ప్రాంతాలను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ సీఎం జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో అన్ని కళాశాలల్లో విద్యార్థులకు మాధక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలు కలిగిన, వినియోగిస్తున్న వారి వివరాలను సెల్ 8332959175 లేదా 9550351100 నెంబర్లకు మెసేజ్ చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆశ్రం సీఈఓ డాక్టర్ కె.హనుమంతురావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అమరబాబు, ఇన్‌స్పెక్టర్ కృష్ణధనరాజు, ఎస్సైలు శ్రీనివాసరెడ్డి, ఎస్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.9.50 కోట్లతో స్టేడియం అభివృద్ధి

ఏలూరు(మెట్రో): ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దనున్నట్లు ఎంపీ కోటగిరి శ్రీధర్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు స్టేడియం అభివృద్ధిపై శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌తో చర్చించారు. అనంతరం ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఇండియా నిర్మించిన ఏకైక అథ్లెటిక్ కేంద్రం అల్లూరి సీతారామరాజు స్టేడియం అని, ఇక్కడ శిక్షణ తీసుకున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటారన్నారు. స్టేడియంలో ప్రస్తుతం సింథటిక్ ట్రాక్ లేదని, రాష్ట్రంలో నాగార్జున యూనివర్సిటీలోని స్టేడియంలో మాత్రమే సింథటిక్ ట్రాక్ ఉందన్నారు. అల్లూరి సీతారామరాజు స్టేడియాన్ని రూ.9.50 కోట్లతో తీర్చిదిద్ది, ఎనిమిది లైన్ల ట్రాక్ ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 50 శాతం వరకు నిధులు సమకూరుస్తుందని, మిగిలిన 50 శాతం నిధులను స్థానికంగా సేకరించాల్సి ఉందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి నిధులు అందిస్తామని, వీటితో పాటు ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులు కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. స్టేడియం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారన్నారు. కలెక్టర్, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, క్రీడాభివృద్ధి సంస్థల సహకారంతో స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఏలూరు అర్బన్ డెవ్‌మెంట అథారిటీ కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ చీఫ్ కోచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓపెన్ వర్సిటీ ప్రవేశాలకు 20 వరకు గడువు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ బీఏ, బీకాం, బీఎస్సీ తదితర డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు తేదీ పొడిగించినట్లు వర్సిటీ రీజినల్ కో–ఆర్డినేటర్ వీఏఎస్ సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 20 వరకూ గడువు పొడిగించారని, అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థుల ట్యూషన్ ఫీజు చెల్లించడానికి సైతం గడువు తేదీని ఈనెల 20 వరకూ పొడిగించారని తెలిపారు.

10న మినీ జాబ్ ఫెయిర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట)/బుట్టాయగూడెం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల (స్కిల్ హబ్)లో ఈనెల 10న మినీ జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, టీమ్ లీస్, జీ–గ్రూప్ కంపెనీల్లో సుమారు 400 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18–35 ఏళ్ల వయసున్న వారు అర్హులని తెలిపారు. వివరాలకు సెల్ 9652503799, 9666322032, (99888 53335–టోల్ ఫ్రీ)లో సంప్రదించాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

సార్వా సిరులు

- 15 నుంచి కొనుగోళ్లు
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 12 లక్షల టన్నుల దిగుబడి
- 575 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

సార్వా సాగు

జిల్లా	ఎకరాలు (లక్షల్లో)	దిగుబడి అంచనా (లక్షల టన్నుల్లో..)	కొనుగోలు కేంద్రాలు
ఏలూరు	2.26	6.78	261
పశ్చిమగోదావరి	2.13	5.28	314
మొత్తం	4.39	12.06	575



సాక్షి, భీమవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సార్వా వరి పంట ఆశాజనకంగా ఉండగా.. ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం సర్వత్రా సిద్ధం చేసింది. జిల్లావ్యాప్తంగా సుమారు 4.39 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా దాదాపు 12 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. రైతుల స్థానిక అవసరాలకుపోను మిగిలిగిన ధాన్యం కొనుగోళ్లకు 575 రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ తర్వాత ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు చెబుతున్నారు. ప్రస్తుత సార్వా సీజన్‌లో వర్షాలు సక్రమంగా లేకపోయినా సాగునీటి కొరత లేకపోవడంతో పైరు ఏపుగా పెరిగి పంట కళకళలాడుతోంది. ముందుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో కొన్నిచోట్ల ఇప్పటికే మాసూళ్లు ప్రారంభించగా ఎకరాకు 35 బస్తాలకు పైగా దిగుబడి వస్తున్నట్టు రైతులు చెబుతున్నారు.

4.39 లక్షల ఎకరాల్లో

పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో 2.13 లక్షల ఎకరాల్లో సార్వా వరి సాగుచేయగా దాదాపు 5.28 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అలాగే ఏలూరు జిల్లాలో 2.26 లక్షల ఎకరాల్లో నాట్లు వేయగా 6.78 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. ఈ మేరకు ధాన్యం కొనుగోళ్లకు పశ్చిమగోదావరి జిల్లాలో 314 ఆర్‌బీకేలు, ఏలూరు జిల్లాలో 261 ఆర్‌బీకేల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. పశ్చిమగోదావరిలో 4.56 లక్షల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ మేరకు 942 మంది టెక్నికల్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, హెల్పర్స్‌ను నియమిస్తున్నారు. అలాగే ధాన్యం పట్టుబడికి కోటి వరకు గోనె సంచులు అవసరమని గుర్తించి ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. అలాగే హమాలీలు, రవాణా వాహనాలను కూడా సమకూరుస్తున్నారు.



తాడేపల్లిగూడెం ప్రాంతంలో కోతకు సిద్ధమైన సార్వా వరి పంట

ధాన్యం ధరలు

ప్రస్తుత సీజన్‌లో ప్రభుత్వం ధాన్యం మద్దతు ధర పెంచడంతో కామన్ రకం ధాన్యం 75 కిలోల బస్తాకు రూ.1,637, ఏ గ్రేడ్ రకానికి బస్తాకు రూ.1,652 రైతులకు దక్కనుంది. అయితే ధాన్యంలో తేమ 17 శాతానికి మించకుండా ఉండాలి. గత దాళ్వా సీజన్‌లో ఎండలు ఎక్కువగా ఉండటం, ధాన్యం కూడా ఎక్కువగా ఆరబెట్టడం వల్ల బియ్యం ముక్క కావడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. అయితే ప్రస్తుత సీజన్‌కు తగినంతగా ఎండబెట్టి పట్టుబడులు పట్టుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

15 నుంచి కొనుగోళ్లు



ప్రస్తుత సార్వా సీజన్‌లో ధాన్యం కొనుగోలు అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తాం. ఈ సీజన్‌లో పశ్చిమ గోదావరి జిల్లాలో 4.65 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశాం. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఇబ్బందులు రాకుండా ముందస్తుగానే చర్యలు తీసుకుంటాం. ఈనెల 15 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం. ముందుగా మాసూళ్లు జరిగే తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాల్లో ఇప్పటికే 9 లక్షల గోనె సంచులు సిద్ధం చేశాం. ధాన్యం తరలించే వాహనాలకు ఈ ఏడాది ప్రత్యేకంగా జీపీఎస్ పరికరాలను అమర్చేందుకు చర్యలు తీసుకున్నాం. బియ్యం ముక్క కాకుండే ఉండేందుకు రైతులు వ్యవసాయ అధికరుల సూచనలు పాటించాలి.

– ఎస్.రామసుందర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్, పశ్చిమగోదావరి

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

కలెక్టర్ ప్రశాంతి



వైద్య సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ ప్రశాంతి

అత్తిలి: వైద్యానికి పేదరికం అడ్డురాకూడదని, ప్రతి కుటుంబం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటమే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం ఉరదాళ్లపాలెం సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. ఈసీజీ, వైద్య పరీక్షలు అనుకున్నంత స్థాయిలో జరగకపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య పరీక్షలు చేయించడంతో పాటు మందులు ఉచితంగా అందిస్తామని, అవసరమైన వారిని మెరుగైన వైద్యానికి రిఫర్ చేస్తామన్నారు. మారుమూల గ్రామాల్లోకి సైతం స్పెషలిస్టుల సేవలు అందుబాటులోకి వచ్చాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 351 మందికి వైద్య పరీక్షలు చేయగా 14 మందికి మెరుగైన వైద్యానికి రిఫర్ చేశారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కె.మురళీకృష్ణ, సర్పంచ్ శింగంశెట్టి శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాస్, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంపీడీఓ అమీలుజమా పాల్గొన్నారు.

పవన్ తీరు కాపు జాతికి అవమానం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



మాధవరం గ్రామంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: కాపుల ఆత్మాభిమానం, ఆత్మస్థైర్యం, ఆత్మ విశ్వాసం దెబ్బతినేలా, పౌరుషం లేని జాతిలా పవన్ కళ్యాణ్ వ్యవహరించడం కాపు జాతికే తీరని అవమానమని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అవినీతి, అక్రమాలకు పాల్పడి జైలుకు వెళ్లిన చంద్రబాబును పట్టుకుని వేలాడుతూ మంచి చేస్తున్న సీఎం జగన్‌కు వ్యతిరేకంగా పనిచేయడం దారుణమన్నారు. దీనిపై జనసేన సోదరులు ఒక్కసారి ఆలోచించాలన్నారు. ప్రజారాజ్యం పార్టీ మూసివేయడానికి కారకులైన వారితో 2014లో పవన్ కళ్యాణ్ చేతులు కలిపాడని విమర్శించాడు. పవన్ కళ్యాణ్ ద్వారా కాపుల ఓట్లు వస్తాయని చంద్రబాబు భ్రమలో ఉన్నాడన్నారు. ఒంటి చేతితో అందరినీ మట్టి కరిపించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కౌరవులతో పోల్చడం పవన్ అజ్ఞానానికి, అవివేకానికి నిదర్శనమని డిప్యూటీ సీఎం కొట్టు అన్నారు.

విద్యుత్ అధికారుల బదిలీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లకు స్థానచలనం కలిగింది. ఏలూరు డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శశిధర్‌ను ఏలూరు కన్‌స్ట్రక్షన్స్ విభాగానికి, ఏలూరు ఎంఅండ్‌పీ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.సతీష్‌కుమార్‌ను విశాఖ కార్పొరేట్ కార్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. విశాఖ కార్పొరేట్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.నారాయణరావును ఏలూరు ఎంఅండ్‌పీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా, రాజమహేంద్రవరం రూరల్–1 ఆపరేషన్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్‌కు పదోన్నతి కల్పించి ఏలూరు డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

ఏఈఈల బదిలీ : ఏలూరు సౌత్ ఆపరేషన్ ఏఈఈ జి.సురేష్ రెడ్డికి పదోన్నతి కల్పిస్తూ బొమ్మూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారిగా, ఏలూరు డీ4 ఏఈఈ ఎల్‌వీ శ్రీనివాసరావును పదోన్నతిపై ఆకివీడు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా, విజయరాయి ఏఈఈ వి.రంగారావుకు పదోన్నతి కల్పించి సాలూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమించారు. పెనుగొండ డీఈఈ ఎం.నిరంజన్ బాబును అనపర్తికి, ఆకివీడు డీఈఈ కె.రాంబాబును పెనుగొండకు బదిలీ చేశారు.

'జగనన్నకు చెబుదాం'తో సత్వర పరిష్కారం

కలెక్టర్ ప్రశాంతి



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

తాడేపల్లిగూడెం: ప్రజల సమస్యలకు మెరుగైన పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బలుసులమ్మ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలపై ఇచ్చే అర్జీలపై అధికారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌లను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. అవసరమైతే సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలను స్థానికంగానే పరిష్కరించే దిశగా మండల స్థాయిలో వారంలో ఒక్కోరోజు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామస్థాయి సమస్యలు మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారమయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజల సమస్యలకు మెరుగైన, వేగవంతమైన పరిష్కారం అందించే దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అర్హతలు ఉండి ప్రభుత్వ పథకాలు అందుకోలేనివారు, వారి పరిధిలోని సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు అలసత్వం వహించకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల అర్జీలకు అధికారులు అందించే పరిష్కారం స్పష్టంగా ఉంటే స్పందనకు అర్థం ఉంటుందన్నారు. ఆర్డీఓ కె.చెన్నయ్య, కమిషనర్ అనపర్తి శామ్యూల్, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, ఎంపీడీఓ ఎం.విశ్వనాథ్, ప్రజాప్రతినిధులు , పట్టణ, మండల ప్రజలు పాల్గొన్నారు. పట్టణ పరిధిలో 71, తాడేపల్లిగూడెం మండల పరిధి నుంచి 32 అర్జీలు స్వీకరించారు.

చురుగ్గా రీ సర్వే

జేసీ రామసుందర్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో మూడో దశ రీసర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి రీసర్వే స్టోన్ ప్లాంటేషన్, బీహెచ్‌పీఎస్ డిస్ట్రిబ్యూషన్, మ్యూటేషన్ తిరస్కరణ, ఎన్నికలు, ఇనాం భూములు, అసైన్డ్ భూములు, సివిల్ సప్లయ్, అడంగల్ కరెక్షన్, జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు, స్థలసేకరణ, టూరిజం ప్రాజెక్ట్స్, స్పందన గ్రీవెన్స్ తదితర 20 అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. రీ సర్వేలో సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ స్థలం ఎక్కడా వదలకుండా పకడ్బందీగా సర్వే పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులకు కార్డులు త్వరితగతిన అందజేసి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు ఆర్‌బీకేల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులు పక్కాగా చేపట్టాలన్నారు. డీఆర్వో కె.కృష్ణవేణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, ఆర్డీఓ దాసి రాజు, డీఎస్ఓ ఎన్.సరోజ, హౌసింగ్ పీడీ డాక్టర్ ఆర్‌సీ ఆనంద్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ అప్పారావు పాల్గొన్నారు.



పెంటపాడు : రావిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది



నరసాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



పాలకొల్లు అర్బన్: వృద్ధురాలిని వైద్యుడి వద్దకు తీసుకువస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి

అందరికీ ఆరోగ్య భాగ్యం

రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తున్నారు. ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు క్యాంపులను పర్యవేక్షిస్తున్నారు.

– సాక్షి/నెట్‌వర్క్



ఉండి : మహదేవపట్నంలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



వీరవాసరం : మడుగు పోలవరంలో వైద్య సేవలను తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్



పెనుమంట్ర: పెనుమంట్రలో పోషకాహారాన్ని రుచి చూస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


లాల్ సాహెబ్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని తాడువాయిలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ లాల్ సాహెబ్ (66) శుక్రవారం ద్విచక్ర వాహనంపై ఇంటిని నుంచి బయలుదేరాడు. తాడువాయి జాతీయ రహదారిపైకి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లాల్ సాహెబ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు సాఫ్ట్ బాల్ జిల్లా జట్ల ఎంపిక


కామవరపుకోట: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్ పురుష, మహిళ సాఫ్ట్‌బాల్ జట్లు ఎంపికను ఆదివారం నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లాల సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మిడతా రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎంపికైన జట్లు అక్టోబర్ 16 నుంచి 18 వరకూ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో జరిగే ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల 10వ సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. ఎంపికలపై సందేహాలు ఉంటే 94400 82676కు ఫోన్ చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో నంబర్-1

- రోజుకు సగటున 4 నిమిషాలు మాత్రమే పవర్ 'కట్'
- తగ్గుతున్న సరఫరా అంతరాయం
- పునరుద్ధరణ పనుల్లో వినూత్న ప్రణాళికలు
- ఏపీఈపీడీసీఎల్ పరిధిలో దూకుడుగా విశాఖపట్నం సర్కిల్

గాలి వీచిందా..? కరెంట్ గోవిందా.? వర్షం పడుతోందా..? టార్చ్ లైట్స్, చార్జింగ్ లైట్స్ వెతుక్కోవాల్సిందే. ఇంకేముంది.. గంటల తరబడి కరెంట్ రాదు. ఏంటో ఈ పవర్ సప్లై.. రోజులో గంటల తరబడి కరెంట్ ఉండటం లేదు. ఇదీ ఒకప్పుడు వినియోగదారుల నుంచి తరచూ వినిపించే మాట.. కానీ ప్రస్తుతం కాలం మారింది.. కరెంట్ సరఫరాలోనూ మార్పులు వచ్చాయి. సరఫరా అంతరాయమూ మారింది. వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దుకుంటూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఏపీఈపీడీసీఎల్ నిరంతరం శ్రమిస్తోంది. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ఉన్న సర్కిళ్లలో నంబర్ వన్‌లో కొనసాగుతుందని సైడీ సైఫీ సూచీలే స్పష్టం చేస్తున్నాయి.

– సాక్షి, విశాఖపట్నం


పోల్‌పై విద్యుత్ తీగలను సరిచేస్తున్న సిబ్బంది

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) పరిధిలో 5 సర్కిల్స్ ఉన్నాయి. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, ఏలూరు, విజయనగరం సర్కిల్స్ పరిధిలో నిరంతరం విద్యుత్ సరఫరాలో ఉన్న లోపాలు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నారా? లేదా? అనే అంశాలను పరిశీలిస్తుంది. ఇందుకోసం ఏర్పాటు చేసిన వ్యవస్థలే సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ డ్యూరేషన్ ఇండెక్స్ (సైడీ), సిస్టమ్ యావరేజ్ ఇంట్రప్షన్ ఫ్రీక్వెన్సీ ఇండెక్స్ (సైఫీ). రోజూ ఆయా సర్కిల్స్ పరిధిలో ఎంతసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది? ఎంత సమయానికి పునరుద్ధరించారు.? ఇలాంటి వివరాలను ఎప్పటికప్పుడు గణిస్తూ సరాసరిని చూపిస్తుంటుంది. ఈ విషయంలో విశాఖ సర్కిల్ నంబర్‌వన్‌లో నిలిచింది. ఈ సర్కిల్ పరిధిలో 17,57,727 మంది వినియోగదారులున్నారు. ఇందులో 15,02,204 డొమెస్టిక్ కనెక్షన్లుండగా, 1,70,580 కమర్షియల్, 49,037 అగ్రికల్చర్, 30,632 ఇన్‌స్టిట్యూషనల్, 5,274 ఇండస్ట్రీస్ కనెక్షన్లున్నాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని సైడీ సైఫీ ర్యాంకింగ్స్‌ను ప్రకటిస్తారు.

నాలుగు నిమిషాలు మాత్రమే

2014–19 మధ్య కాలంతో పోల్చితే సర్కిల్ పరిధిలో వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ కాలంలో రోజుకు సగటున 60 నుంచి 85 నిమిషాల వరకూ విద్యుత్ అంతరాయం ఉండేది. అంటే 24 గంటల్లో కనీసం గంటకు పైగా కరెంట్ కోతలు ప్రజలను ఇబ్బందులకు గురిచేసేవి. పంపిణీ విషయంలో పక్కాగా వ్యవహరిస్తూ ఆధునిక సాంకేతికతను సిబ్బంది అందిపుచ్చుకుంటూ సరఫరా అంతరాయాన్ని తగ్గించారు. గంట ఉండే అంతరాయం క్రమంగా నిమిషాలకు చేరుకుంది. ఇప్పుడు కేవలం 4 నుంచి 10 నిమిషాలు మాత్రమే రోజులో కరెంట్ సరఫరా ఆగుతుంది. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలలో సగటున రోజుకు 9 నిమిషాలు మాత్రమే పవర్ కట్ అవుతుండగా.. ఈ నెలలో కేవలం 4 నిమిషాలు మాత్రమే సగటు ఇంట్రప్షన్ ఉన్నట్లు సైడీ సైఫీ నివేదికలో స్పష్టమైంది.

విశాఖ సర్కిల్‌కు నంబర్ వన్ ర్యాంకు

గత కొద్ది నెలలుగా విశాఖ సర్కిల్ సైడీ సైఫీ ర్యాంకింగ్‌లో నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకుంటుంది. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అంతరాయాలు లేకుండా అందించడంలో సర్కిల్ అధికారులు, సిబ్బంది సఫలీకృతమవుతున్నారు. తర్వాత ర్యాంకింగ్స్‌లో రాజమండ్రి, శ్రీకాకుళం, ఏలూరు, విజయనగరం ఉన్నాయి. కేవలం సర్కిల్ మాత్రమే కాకుండా ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వినియోగదారులకు ఇంట్రప్షన్ తగ్గిస్తూ సరఫరా అందిస్తున్నారు. విశాఖ సర్కిల్‌లో 4 నిమిషాలు మాత్రమే ఉండగా రాజమహేంద్రవరంలో 8 నిమిషాలు, శ్రీకాకుళం పరిధిలో 10, విజయనగరంలో 13, ఏలూరులో 16 నిమిషాలు మాత్రమే రోజుకు సగటున విద్యుత్ కోతలు ఉంటున్నట్లు సైడీ సైఫీ ర్యాంకింగ్స్‌లో స్పష్టమైంది.

ఏపీఈపీడీసీఎల్ సర్కిల్స్ పరిధిలో సైడీ సైఫీ పెర్ఫార్మెన్స్ వివరాలు

సర్కిల్	మొత్తం ఫీడర్లు	రోజులో సరఫరా సమయం(గం.లలో)	అంతరాయ సమయం (ని.లలో)	ర్యాంకు
విశాఖపట్నం	933	23:55:42	4:17	01
రాజమహేంద్రవరం	953	23:51:12	8:47	02
శ్రీకాకుళం	353	23:49:08	10:51	03
విజయనగరం	425	23:46:09	13:50	04
ఏలూరు	1158	23:43:21	16:38	05

విశాఖ సర్కిల్‌లో కనెక్షన్లు

డొమెస్టిక్	: 15,02,204
కమర్షియల్	: 1,70,580
అగ్రికల్చర్	: 49,037
ఇన్‌స్టిట్యూషనల్	: 30,632
ఇండస్ట్రీస్	: 5,274
మొత్తం	: 17,57,727

మరింత తగ్గించేందుకు కృషి చేస్తున్నాం



ఎప్పటికప్పుడు సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాం. వినియోగదారులకు ఇచ్చే విద్యుత్‌ను నాణ్యంగా ఎలా అందించాలనే అంశంపై సీఎండీ సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం. దానికి అనుగుణంగా మార్పులు చేస్తూ అంతరాయాన్ని క్రమంగా తగ్గించుకుంటూ వస్తున్నాం. ప్రస్తుతం సగటున 4 నిమిషాలున్న ఇంట్రప్షన్‌ను క్రమంగా తగ్గించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. విపత్తుల కారణంగా ఏదైనా అవాంతరాలు ఎదురైనా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇటీవలే ఆటోమేటెడ్ సబ్‌స్టేషన్‌ను రూపొందించాం. మిగిలిన చోట్లా అదే తరహా టెక్నాలజీ వస్తే ఈ అంతరాయం మరింత తగ్గించగలం.

– ఎల్.మహేంద్రనాథ్, ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ

దూరప్రాంతాలకు వెళ్లి పింఛన్ అందజేత


రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో రత్తమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వీరబాబు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగగుంట గ్రామానికి చెందిన రాజులపాటి రత్తమ్మ అనారోగ్యంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ నెల ఆమె ఇంటికి పింఛన్ అందించేందుకు వెళ్లగా ఆమె అనారోగ్యం విషయాన్ని వలంటీర్ కామన వీరబాబు తెలుసుకున్నాడు. ఈనేపథ్యంలో శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి పింఛన్‌ను అందజేశాడు. వలంటీర్ వీరబాబును సర్పంచ్ కట్టా సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

భీమవరంలో..

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం సచివాలయం పరిధిలోని కొమ్మన సుబ్బాయమ్మ అనారోగ్య కారణాలతో భీమవరం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ నెల అందించాల్సిన పింఛన్‌ను సిద్ధాంతం సచివాలయం-03కు చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్ కోన మోహనరావు గురువారం రాత్రి ఆస్పత్రికి వెళ్లి అందించాడు. మోహనరావును ఎంపీడీఓ ఎస్. శ్రీనివాస దొర తదితరులు అభినందించారు.

హత్యకేసులో ఇద్దరి అరెస్టు

సాక్షి, భీమవరం: భీమవరం టుటౌన్ పరిధిలో గత నెల 17న జరిగిన విజయబాబు హత్య కేసులు మరొక ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్టు చేసినట్లు టుటౌన్ సీఐ జి.శ్రీనివాస్ చెప్పారు. పట్టణంలోని రౌడీషీటర్ విజయబాబు హత్యకేసులో పరారీలో ఉన్న విస్సాకోడేరు గ్రామానికి చెందిన పి.ఉదయ్‌కిరణ్, బి.కిషోర్‌లను అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

మైనర్ బాలికపై అత్యాచార యత్నం

వీరవాసరం: వీరవాసరంలో 10 సంవత్సరాల మైనర్ బాలికపై ఓ వ్యక్తి అత్యాచారం యత్నం చేయడంతో కలకలం రేగింది. వివరాల ప్రకారం వీరవాసరం గ్రామంలోని పెదపేటకు చెందిన రాపాక సురేష్ (35) అదే ప్రాంతానికి మైనర్ బాలిక అమ్మమ్మ ఇంట్లో గురువారం రాత్రి నిద్రించడం గమనించాడు. బాలిక అమ్మమ్మ ఇంట్లో లేని సమయంలో లోపలికి చొరబడి బాలికపై అత్యాచారయత్నం చేశాడు. అయితే ఆ సమయంలో బాలిక గట్టిగా కేకలు వేయడంతో అక్కడ నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై బాలిక బంధువులు శుక్రవారం ఉదయం పోలీసులను ఆశ్రయించారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ రవిప్రకాష్, దిశ డీఎస్పీ నాగమురళికృష్ణ, భీమవరం రూరల్ సీఐ వై.సత్యకిషోర్, ఎస్సై పి.రమేష్ పరిశీలించారు. నిందితుడికి కచ్చితంగా పట్టుకుంటామని తెలిపారు.

సౌత్ ఇండియా అథ్లెటిక్స్ పోటీలకు ఎస్‌కేవీసీ అథ్లెట్లు


సౌత్ ఇండియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన ఎస్‌కేటీసీ క్రీడాకారులు

ఏలూరు రూరల్: దక్షిణ భారత జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఏలూరు ఎస్‌కేటీసీ సెంటర్ చెందిన 13 మంది అథ్లెట్లు ఎంపికయ్యారని సెంటర్ ఇన్‌చార్జి డీఎస్‌వీ వినాయక ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. వీరు ఈ నెల 15 నుంచి 17 వరకూ తెలంగాణలోని హనుమకొండలో జరిగే సౌత్ ఇండియా పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ పోటీలకు అర్హత సాధించారని వివరించారు. వీరిలో ఎస్.లక్ష్మణ, పి.నరేంద్ర, డి.విష్ణువర్ధన్, టి.శ్యామల్‌రాజ్, డి.ఉదయ్, కె.దనుస్సు, కె.తిలక్‌పవన్, బి.సుకుమార్, జి.గణేష్, బి.అర్చన, జి.నీలిమ, ఎం.మానస, బి.జాహ్నవి ఉన్నారని వెల్లడించారు. వీరు పోటీల్లో పాల్గొంటారని వివరించారు. 100, 800, 1500, 400 మీటర్ల హర్డిల్స్ పరుగు పందెం, స్టీపుల్ జంప్, జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ తదితర అంశాల్లో పోటీ పడతారని పేర్కొన్నారు.

ఇకపై రూప్‌చంద్ చేపలు కిలో రూ.80


చేపల ఎగుమతి ట్రేడర్ల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: రూప్‌చంద్ చేపలు కేజీ ధర ఇక నుంచి కనీసం రూ.80కు తక్కువ కాకుండా అమ్మాలని రైతులు నిర్ణయించారు. ఈ మేరకు చేపలు ఎగుమతి ట్రేడర్ల(ఏజెంట్లు) కేజీకి రూ.80 ఇచ్చి కొనుగోలు చేస్తామని వెల్లడించారు. శుక్రవారం ఉంగుటూరు మండలంలోని నారాయణపురం సుబ్బరాజు ఐస్ పరిశ్రమ వద్ద ఉంగుటూరు నియోజకవర్గంలోని ఆక్వా రైతులు, ఏజెంట్లు , ట్రేడర్ల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పాతూరి శ్రీనివాసరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాలు ఆక్వా రైతులు, ఏజెంట్లు, ట్రేడర్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న ఆక్వారంగ సమస్యలపై చర్చించారు. ప్రధానంగా రూప్‌చంద్‌చేపలు కిలో రూ.69కు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోయారు. వ్యక్తంచేశారు. ఈ క్రమంలో కేజీ చేపను కనీసం రూ.80కు కొనుగోలు చేస్తామని ఏజెంట్లు తెలుపగా రూ.80 కంటే తక్కువకు అమ్మకూడదని రైతులు నిర్ణయించుకున్నారు. ఇదే విషయంపై ఈ నెల 15 మధ్యాహ్నం నాలుగు గంటలకు విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని పాతూరి శ్రీనివాసరాజు వెల్లడించారు. సమావేశంలో గణపవరం ఎంపీపీ దండు రాము, పెనుమత్స రామచంద్రరాజు, దండు వెంకటరామరాజు, పాతూరి బెనర్జి ప్రసాదరాజు కె.ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను వివరిస్తూ..


తాడేపల్లిగూడెం రూరల్: మాధవరంలో మహిళకు సంక్షేమ పథకాల వివరించి బ్రోచర్‌ను అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


పాలకోడేరు: ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు

గిరిజన పల్లెల్లో భూవివాదం


వంక బొత్తప్పగూడెం సమీపంలోని భూమిలో తగాదాపడుతున్న గిరిజనులు, గిరిజనేతరులు

కొయ్యలగూడెం: మండలంలోని సరిపల్లి గ్రామ పంచాయతీ వంక బొత్తప్పగూడెంలో గిరిజన గిరిజనేతరుల మధ్య భూ వివాదం శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గిరిజనులతో పాటు మరికొంతమంది గిరిజన గ్రామాల ప్రజలు వివాదాస్పద భూమిలోకి ప్రవేశించి ట్రాక్టర్లతో దున్నటం ప్రారంభించారు. దీనిని గిరిజనేతర రైతులు అడ్డగించడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. తన ఆరు ఎకరాల భూమిని గిరిజనులు ఆక్రమించుకున్నారంటూ గిరిజనేతర రైతు కలగర శేషారత్నం ఆరోపించాడు. అదే విధంగా కలగర కుమారస్వామిది 3.45 ఎకరాలు, గద్దె శుభశ్రీ 7.85 ఎకరాలు, కొడాలి నాగవేణి 5.96 ఎకరాల భూమిని ఆక్రమించి దున్ని వేస్తున్నారంటూ ఆందోళనకు దిగారు. స్థానికేతర గిరిజనులు వచ్చి ప్రశాంతంగా ఉంటున్న తమ ప్రాంత గిరిజన గిరిజనేతర రైతుల మధ్య వైషమ్యాలు సృష్టించారని బాధిత రైతులు ఆరోపించారు. భూములు తమ పూర్వీకులకు చెందినవని గిరిజనులు పేర్కొంటున్నారు. దీనిపై తహసీల్దార్ పాసం నాగమణి మాట్లాడుతూ భూములు విషయం కోర్టులో ఉందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఘర్షణలకు, దౌర్జన్యాలకు పాల్పడకూడదని సూచించారు. వివాదాస్పద భూములకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు సైతం నకిలీవి సృష్టించి కొందరు అలజడి చేస్తున్నారని దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

గ్యాస్ లీకై నలుగురికి అస్వస్థత


భీమవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా కార్మికులు

కాళ్ల: ఐస్ ఫ్యాక్టరీని తొలగిస్తుండగా గ్యాస్ లీకై పక్కనే ఉన్న రొయ్యల ఫ్యాక్టరీలోని నలుగురు మహిళా కార్మికులు అస్వస్థతకు గురైన సంఘటన కాళ్ల మండలం కోపల్లె గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోపల్లె గ్రామంలోని ఆర్‌వీఆర్ రొయ్యల ఫ్యాక్టరీని ఆనుకుని ఉన్న ప్రభు ఐస్ ఫ్యాక్టరీ సుమారు ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. ఐస్ ఫ్యాక్టరీని తొలగించే పనులు శుక్రవారం సాయంత్రం చేపట్టారు. ఈ క్రమంలో కంప్రెషర్‌లో నిక్షిప్తమై ఉన్న గ్యాస్ లీకవ్వడంతో దాని ప్రభావానికి ప్లాంట్‌ను అనుకుని ఉన్న ఆర్‌వీఆర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న మహిళా కార్మికులు ఒక్కసారిగా అస్వస్థతకు గురైనట్టు తెలిపారు. దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యం హుటాహుటిన నలుగురు మహిళా కార్మికులను భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కాళ్ల పోలీసులు, భీమవరం ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు కాళ్ల ఎస్సై వీరభద్రరావు తెలిపారు. అయితే అస్వస్థతకు గురైన మహిళా కార్మికుల ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని భీమవరం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరాస్వామి విలేకరులకు వెల్లడించారు.

వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై అవగాహన


గుంపర్రులో డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉండి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు

యలమంచిలి: గుంపర్రు, కాంబొట్లపాలెం, చింతదిబ్బ గ్రామాలకు చెందిన రైతులకు వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై శుక్రవారం ఉండి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. డ్రోన్ తీసుకువచ్చి దాని ద్వారా మందు ఎలా పిచికారీ చేయాలో? చూపించారు. ఈ సందర్భంగా కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త ఎ.రాజేష్ మాట్లాడుతూ సాగులో పురుగు మందులు, తెగుళ్ల మందులు పిచికారీకి డ్రోన్ వినియోగించడం వల్ల కూలీల కొరత తగ్గడం, తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో తెగుళ్లను అరికట్టవచ్చునన్నారు. ఒక ఎకరానికి 10 లీటర్ల మందు సరిపోతుందన్నారు. కేవలం 8 నుంచి 10 నిమిషాల్లో ఎకరా చేనుకు పిచికారీ చేయవచ్చునన్నారు. దీని వల్ల కూలీల కొరతను అధిగమించడంతోపాటు సమయం, ధనం ఆదా చేయడమే కాకుండా అధిక లాభం వస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి మాట్లాడుతూ డ్రోన్ కొనుగోలుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, ఆసక్తి ఉన్న రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వినయలక్ష్మి రజిత, వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్, బూరుగుపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి, రైతులు గణపాబత్తుల ఏసుబాబు, జడ్డు బదరీ నారాయణ, గుడాల వెంకట్రావు పాల్గొన్నారు.

లారీ క్యాబిన్ నుంచి జారిపడి డ్రైవర్ మృతి

పెంటపాడు: లారీ క్యాబిన్ నుంచి కిందకు దిగుతూ ప్రమాదవశాత్తూ కిందపడి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రత్తిపాడు జాతీయ రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామానికి చెందిన తేళ్ల శ్రీశైలం(52) క్రాంతి పార్సిల్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసులో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం విజయవాడ నుంచి పార్సిల్ డెలివరీ చేసేందుకు జిల్లాలోని పెనుగొండ వెళ్లాడు. డెలివరీ అనంతరం విజయవాడ వెళ్లే సమయంలో రాత్రి కావడంతో లారీని ప్రత్తిపాడు జాతీయరహదారి వద్ద పక్కగా ఆపి క్యాబిన్ ఎక్కి పడుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున లారీ దిగుతుండగా అతను కట్టుకున్న లుంగీ లారీ కొక్కేనికి ఇరుక్కుపోవడంతో ప్రమాదవశాత్తూ పైనుంచి జారి కిందపడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు ప్రవీణ్‌బాబు ఫిర్యాదు మేరకు ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా నేతలపై వ్యాఖ్యలు సిగ్గుచేటు


పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

ఏలూరు టౌన్: మహిళలపై టీడీపీ నేతలు నీచమైన బుద్ధిని చాటుకుంటూ మహిళా నేతలపైన సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడడం సిగ్గుచేటని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె ఏలూరులో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నేత బండారు సత్యనారాయణ మంత్రి రోజాపై చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. బండారు సత్యనారాయణ నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అక్కాచెల్లెమ్మలకు అండగా నిలుస్తుంటే.. టీడీపీ నేతలు మహిళలపై తమ అక్కసు చూపుతున్నారన్నారు. ఇటీవలే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ భార్యను సైతం మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అదీఇదీ అంటూ మాట్లాడడం చూస్తుంటే టీడీపీ మహిళలకు ఎంత గౌరవం ఇస్తుందో? అర్థం అవుతుందని పేర్కొన్నారు. మహిళలు 2019 ఎన్నికల్లో అందుకే టీడీపీని బంగాళాఖాతంలో కలిపేశారని, అయినా టీడీపీ నేతల్లో మార్పు రావడం లేదని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా పాతాళానికి తొక్కేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మండిపడ్డారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల ప్రతిభ


మిరియాల ద్వారకా పవన్


కే.నాగసౌమ్య శ్రీలక్ష్మి

తాడేపల్లిగూడెం (టీఓసీ): నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 19 ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి ఎంపికలు ఏలూరులోని సీతారామరాజు స్టేడియంలో ఇటీవల జరిగాయి. బాలురు, బాలికల విభాగాల్లో తాడేపల్లిగూడెం పట్టణంలోని స్కూల్ విద్యార్థులు మిరియాల ద్వారకా పవన్, కే.నాగసౌమ్య శ్రీలక్ష్మిలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు అక్టోబర్ 7, 8, 9 తేదీల్లో చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి నేషనల్ స్కూల్ గేమ్స్‌లో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. సంస్థ యాజమాన్యం ఇరువురు విద్యార్థులను అభినందించారు.

టీడీపీ హయాంలో దళితులకు అన్యాయం

తణుకు టౌన్: అమరావతి ప్రాంతంలో అన్యాయానికి గురైన దళిత బహుజనులకు జరిగిన అన్యాయాన్ని పట్టించుకోకుండా జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తెలుగుదేశం పార్టీకి మద్దతు ప్రకటించడం, రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు చెప్పారు. శుక్రవారం తణుకులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో దళిత బహుజనులకు జరిగిన అన్యాయంపై పవన్ కళ్యాణ్ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఈకార్యక్రమంలో మాల మహానాడు నాయకులు కే రాజారత్నం, కే మోషే, బీ సందీప్, బీ సునీల్ బాబు, రోహిత్‌లు పాల్గొన్నారు.

పోలీసులు దృఢంగా ఉండాలి


భీమవరంలో పోలీసు పరేడ్‌లో మాట్లాడుతున్న ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు

సాక్షి, భీమవరం: పోలీస్ సిబ్బంది శారీరక, మానసికంగా దృఢంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని జిల్లా అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు అన్నారు. భీమవరం మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం సివిల్, ఏఆర్, హోంగార్డ్స్ పోలీసు సిబ్బందికి పరేడ్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీసు సిబ్బంది ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైతే జిల్లా పోలీస్ ఆరోగ్య కేంద్రం సేవలను వినియోగించుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం, యోగా చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు దృఢంగా ఉండగలుగుతారని ఏఎస్పీ సూచించారు. కార్యక్రమంలో భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు అభినందనలు


ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

సాక్షి, భీమవరం: రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమితులైన భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి కలిసి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అందుకోవాలని వారు ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు బడుగు అశోక్‌బాబు, రాష్ట్ర సెక్రటరీ కామన నాగేశ్వరరావు, భీమవరం నియోజకవర్గ ప్రెసిడెంట్ పేపేటి పెద్దిరాజు, జనరల్ సెక్రటరీ బేతపూడి లోకేష్, రామాని కాస్రో, ఏజీపీ యు.వరప్రసాద్ తదితరులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

పాలకోడేరు: తన మరదలు కనిపించడం లేదని బావ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు. శృంగవృక్షం గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి ఏరియాకు చెందిన లక్ష్మీ సరస్వతి(23) ఇంటర్ చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈమె తల్లి ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లింది. ఇదిలావుండగా అదే గ్రామంలో ఉంటున్న తన అక్క ఇంటికి లక్ష్మీ సరస్వతి ఈనెల 4వ తేదీన అన్నప్రాసన ఫంక్షన్‌కు వెళ్లింది. అదే రోజు మధ్యాహ్నం వాష్ రూమ్‌కి వెళతానని చెప్పి తిరిగి రాలేదని ఆమె బావ మంద ప్రవీణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా అదే వీధిలో ఉంటున్న మురాల కిరణ్ అనే వ్యక్తితో తరచూ తన మరదలు మాట్లాడేదని, అతనిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

జగనన్న సురక్షతో మెరుగైన వైద్యం

గ్రామాల్లో ప్రారంభమైన జగనన్న సురక్ష శిబిరాలు

తాడేపల్లిగూడెం రూరల్: పేదల ముంగిటకు వైద్యాన్ని తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జెడ్పీటీసీ ఆంజనేయులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు కృషి చేసిన ప్రభుత్వాలు లేవన్నారు. ఎన్నడూ లేని విధంగా గ్రామ స్థాయిలోనే వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం శుభ పరిణామమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకుని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలన్నారు. సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటే, వారి కేష్ షీట్‌లో ఆరోగ్య పరిస్థితిని పేర్కొనడం జరుగుతుందన్నారు. తద్వారా రోగులకు ఉన్నత వైద్యం అందించడం సులభతరం అవుతుందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసుకోవలసిన అవసరం లేకుండానే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లోనే వైద్యం అందిస్తారన్నారు. మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్ కుమార్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం రోగులకు వైద్యులు సూర్యసుభాషి, టి.గౌతమి, సింధూ, ఎస్.శ్రీహర్ష వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ నార్ని రవికాంతనాగేశ్వరరావు (నాగులు), ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఎంపీహెచ్‌వో జి.వెంకటేశ్వరరావు, హెచ్‌వీ శిరోమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఏఎస్‌ఎంలు ఎ.నాగసత్యవాణి, జి.రాజేశ్వరి, సీహెచ్.విజయనిర్మల, జి.దీవెనమ్మ, వి.రమాజ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీలు జి.కృపా జాకబ్, పి.దివ్యజ్యోతి, డి.రామతారకం, ఫార్మాసిస్ట్ డి.అప్పన్న, సూపర్‌వైజర్ కే.హరినాథ్, వివి.భాస్కర్, ఆశాలు ఎస్.దేవి, జి.ప్రశాంతి, జి.దుర్గాభవానీ, ఉండ్రాజవరపు రమణ, యర్రంశెట్టి వెంకటలక్ష్మి, ఎస్.కనకదుర్గ, ఎం.కుమారి, జి.నాగలక్ష్మి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ గుమ్మాపు మేరీ, కార్యకర్త నూలి సునీత, నాయకులు అడ్డాల గోపీకృష్ణ, ముప్పిడి లక్ష్మణరావు, ఉండ్రాజవరపు రాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, శిబిరంవద్ద ఏర్పాటుచేసిన పోషకాహార స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఐసీడీఎస్ అధికారులు పోషక విలువలతో కూడిన ఆహారంగురించి ప్రజలకు అవగాహన కల్పించారు.


తాడేపల్లిగూడెం రూరల్: చిన్నారులను పరీక్షిస్తున్న వైద్యులు


తాడేపల్లిగూడెం రూరల్: మందులు ఉచితంగా అందజేస్తున్న దృశ్యం

పేదల ఆరోగ్యమే.. జగనన్న ధ్యేయం

పెంటపాడు: పేదప్రజల ఆరోగ్యమే... ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ధ్యేయమని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం శుక్రవారం రావిపాడు ఎంపీయూపీ పాఠశాలలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ వైద్యసేవలే పరమావధిగా భావించి నేడు పేదలకు ఇంటింటికీ ఉచితవైద్యసేవలు చేయిస్తున్న జగనన్నను ప్రజలు తప్పక ఆదరించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షులు కైగాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాల ద్వారా మంచి వైద్యం అందుతోందన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల సర్పంచ్ ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్యసురక్ష వల్ల ఖర్చులేకుండా ప్రతి పేదవానికి ఉచిత వైద్యం అందించడం శుభపరిణామం అన్నారు. పార్టీ మండల గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పులూరి వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు, గ్రామ సొసైటీ అధ్యక్షులు దేవ వెంకటరమణ, పార్టీ నాయకులు ములగాల రామసత్యనారాయణ, పెన్నాడ రాఘవ, మాజీ సర్పంచ్ వింజమూరి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి శోభన్, ఉపసర్పంచ్ దాకే బుల్లబ్బాయి, ఉప్పులూరి హరి, గోకా వెంకటేశ్వరరావు(ఎం.పీ) పూడి శ్రీనివాస్,ఎస్సీ నాయకులు డెక్కపాటి వెంకటరమణ, భరతాంజనేయులు, ముదునూరు వైద్యాధికారి డాక్టర్ ఎస్. వెంకటరమణ, పెంటపాడు వైద్యాధికారి వి. మౌనిక, ప్రత్యేక వైద్యులు ప్రణవి నర్సింగ్ హోం డాక్టర్ వంశీ, ట్రినిటీ ఆసుపత్రి డాక్టర్ పి. నవీన్, కంటి డాక్టర్ రాజేంద్రప్రసాద్, తదితర వైద్యులు వచ్చిన రోగులకు పలు రకాల వైద్యపరీక్షలు చేసారు. నేత్రశిబిరంలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ శిబిరంలో సత్యనారాయణ, ఎం. సాయిబాబా, ముదునూరు, పెంటపాడు పీహెచ్‌సీలకు చెందిన వైద్యసిబ్బంది, మెర్సీ, పూజ్యం శ్రీనివాస్‌శర్మ, రజనీరత్నం, నాగమణి, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలతో పాటు, తహసిల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో సీహెచ్. బాలాజీ, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, జీజీబీ విజయలక్ష్మి, దుర్గాభవాని, పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం

తణుకు టౌన్: ప్రజలందరూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని 1వ సచివాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా బీపీ, సుగర్, కళ్ల పరీక్షలు చేసిన వారికి పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, సొసైటీ అధ్యక్షురాలు వై విజయామూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, గ్రామ కార్యదర్శి ఎం యుగంధర్ శ్రీనివాస్, ఈవోపీఆర్డీ, సచివాలయ సిబ్బంది, వైద్యులు డాక్టర్ బంగారు రవి, డాక్టర్ టీఎల్ఎస్ హరిణీ, డాక్టర్ ఎం రవిశంకర్, తదితరులు వైద్య సేవలందించారు. వివిధ గ్రామాలకు చెందిన సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహానికి సంబంధించిన వివిధ రకాల వంటలను తయారు చేసి ప్రదర్శించారు. శిబిరంలో పాల్గొన్న వారికి రాగి జావను పంపిణీ చేశారు.


పెంటపాడు: రావిపాడు ఎంపీయూపీ స్కూల్ వద్ద జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ దాసరి హైమావతి, తదితరులు


పెంటపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థులు


తణుకు టౌన్: మండపాకలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాలను పరిశీలిస్తున్న వైద్యులు, నాయకులు

స్కూల్ గేమ్స్‌లో ఎస్‌కేఎస్‌డీ విద్యార్థుల ప్రతిభ

తణుకు టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకూ తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించిన అండర్ 19 విభాగంలో జిల్లాలోని వివిధ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన గేమ్స్‌లో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా జూనియర్ కళాశాలలో 23మంది విద్యార్థినీలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బీహెచ్ హిమబిందు తెలిపారు. ఈపోటీలకు తమ కళాశాలకు చెందిన విద్యార్థినీలు బ్యాడ్మింటన్ విభాగంలో ఎన్ హాస్య, శ్రీలక్ష్మీ, పీ దీపికలు, బాస్కెట్ బాల్‌లో ఎల్ పావని, ఎస్ఎం గాయిత్రి, కబడ్డీలో కె మహాలక్ష్మీ, యోగాలో బీ లక్ష్మీ, ఎం శృతి, ఆర్ అమృత వర్షిణీ, వై మహాలక్ష్మీలు, టేబుల్ టెన్నిస్‌లో టీ మానస దుర్గ, చదరంగంలో పీ దీపిక, వాలీబాల్‌లో ఏ సంజన, ఏ శిరీషా, యూ స్వరూప భవాని, బ్యాడ్మింటన్‌లో ఏ అమృతవర్షిణీ, ఆర్ మేఘన, ఎం మౌనిక, ఖోఖోలో కె ధనుష, డీ సిరి, టీ సుష్మ భారతి, బేస్ బాల్‌లో ఏ శిరీసా, సాఫ్ట్ బాల్‌లో ఏ శిరీషా, క్రికెట్‌లో డీ నాగమౌనికలు ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా రాష్ట్రస్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినీలను, పీడీలు ఎం శ్రీనివాసరావు, ఎం రత్నకుమారి, యోగా ఇన్‌స్ట్రక్టర్ జీ అబ్బులు చౌదరిలను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, ఇతర అధ్యాపకులు అభినందించారు.

పాదయాత్ర భక్తులకు ఆతిథ్యం

అత్తిలి: కాలినడకన ద్వారకా తిరుమలకు వెళుతున్న భక్తబృందానికి అత్తిలిలో జీఎస్‌సీ ఫర్నిచర్ షోరూం అధినేత రెడ్డి నాగశ్రీనివాసరావు ఆతిథ్యం ఇచ్చారు. పాలకొల్లు పట్టణం నుంచి కాలినడకన బయలుదేరిన సుమారు 500 మంది భక్తులకు అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో స్వాగతం పలికారు. వీరికి మంచినీరు, మజ్జిగ, స్నాక్స్ అందజేసి, వైద్యపరీక్షలు నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పెంచాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని ఆర్టీసీ డిపో మేనేజర్ గిరిధర్ కుమార్ అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. డీఎం గిరిధర్ కుమార్ మాట్లాడుతూ ఇతర దేశాల్లో పెద్ద హోదా గలవారు సైతం మొక్కలు పెంచుతారని, దీనితో పాటు పరిశుభ్రత పాటించడాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరిస్తారన్నారు. హెచ్ఎం ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అందుబాటులో ఉన్నత విద్య

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- మాధవరంలో గడపగడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: ధనికుల పిల్లలతో సమానంగా పేదల పిల్లలు కూడా చదువుకునేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నత విద్యను అందిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని మాధవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచే ఆంగ్ల మాధ్యమ విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. తద్వారా ఉన్నత వర్గాలకే ఉద్యోగాలనే అపోహ నుంచి పేద కుటుంబాలు బయటకొచ్చాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి మంచి చేస్తున్నారన్నారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక లబ్ధి చేకూరుస్తూ పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. అయితే, పవన్ మంచిని వదిలి చెడును పట్టుకుని వేలాడుతున్నాడని విమర్శించారు. రంగా హంతకుడు, ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని రోడ్డుకీడ్చి చిత్రహింసలకు గురి చేసిన కాపు ద్రోహి చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ చేతులు కలపడం సిగ్గుచేటన్నారు. పవన్‌ను వ్యక్తిగతంగా అప్రతిష్టకు గురి చేయడంతో పాటు రాజకీయంగా అణగదొక్కడానికి చంద్రబాబు కుట్ర చేస్తున్నరని ఆరోపించారు. పవన్ కళ్యాణ్ ద్వారా కాపు ఓట్లు వస్తాయని చంద్రబాబు భ్రమలో ఉన్నాడన్నారు. ఒకప్పుడు కాపు జాతి చదువును నిర్లక్ష్యం చేసి వెనుకబడిందని, నేడు కాపు కుటుంబాల్లో ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదివి విదేశాలకు వెళ్తున్నారన్నారు. ఎన్నికల ముందు హామీనివ్వకపోయినా కాపు మహిళలకు కాపు నేస్తం అమలు చేస్తున్నారన్నారు. 2014లో టీడీపీకి మద్దతు పలికిన పవన్ కళ్యాణ్ నాడు ఆ ప్రభుత్వాన్ని ఏనాడైనా నిలదీశాడా ?అని ప్రశ్నించారు. డ్వాక్రా మహిళలు, రైతులకు రుణ మాఫీ చేస్తానని ఎగ్గొట్టిన చంద్రబాబును ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ఒకప్పుడు భూస్వాములైన కాపులు నేడు సన్న, చిన్నకారు రైతులుగా మిగిలిపోయారన్నారు. ఇతర సామాజికవర్గాలు ఊరు వదిలి వెళ్లడంతో ఆర్థికంగా ఎదిగారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి న్యాయం చేస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎవరి వల్ల మంచి జరుగుతుందో... ఎవరి వల్ల మేలు జరుగుతుందో... ఎవరి వల్ల మనకు ఇంటిలో మంచి జరిగిందో ప్రతీ ఒక్కరూ, ప్రతీ కుటుంబం ఆలోచించాలన్నారు. మీ ఇంటిలో మంచి జరుగుతుందనుకుంటే వైఎస్సార్‌సీపీని రాబోయే ఎన్నికల్లో బలపర్చాలని, తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని ప్రజల్ని కోరారు. తొలుత సచివాలయం, ఆర్‌బీకే కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పొనుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎమ్పీటీసీలు ప్రత్తి వీరభారతి, కవులూరి సుబ్బలక్ష్మి, నార్ని రవికాంత నాగేశ్వరరావు (నాగులు), నార్ని శంకరరావు, మార్లపూడి సుబ్బారావు, సొసైటీ చైర్మన్లు జడ్డు హరిబాబు, వెలిశెట్టి నరేంద్రకుమార్, గుమ్మళ్ళ తాతారావు, చిక్కాల సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఏడీఏ పి.మురళీకృష్ణ, పీఆర్ డీఈ వీఎస్.వేణుగోపాల్, ఆర్ఎస్.ప్రసాద్, సచివాలయ ఈవో ఆర్‌వీ.బ్రహ్మం,ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, హౌసింగ్‌వర్క్ ఇన్‌స్పెక్టర్ కే.నాగేశ్వరరావు, నాయకులు కవులూరి వెంకన్న, ప్రత్తి రంగయ్య, మాజీ సైనికులు బొల్లం వీరయ్య, లక్కాకుల సూర్యారావు, తారమట్ల శ్రీనివాస్, ప్రత్తి రఘు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాధవరంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ఐక్యంగా డిమాండ్లు సాధించుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: ఏఎంసీ పెన్షనర్లు ఐక్యంగా డిమాండ్లు సాధించుకోవాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పెన్మెత్స రామకృష్ణంరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పడాల వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏఎంసీ పెన్షనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణంరాజు మాట్లాడుతూ పెన్షనర్ల ప్రధాన సమస్య అయిన 010 హెడ్ ఆఫ్ అకౌంట్‌కు పెన్షన్లు జమయ్యేలా కృషి చేస్తున్న రాష్ట్ర సంఘానికి సభ్యులు సహకారం అందించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపూడి గాంధీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లులు త్వరలో పరిష్కారమవుతాయన్నారు. పోరాడి సాధించుకున్న ఎంప్లాయిస్ హెల్త్ కార్డులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా సలహాదారు కేవీ.భాస్కరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, ఎం.రాజారావు, ప్రకాష్‌రావు, జి.రాజారావు, ఐ.పాండురంగారావు, నాగభూషణం, పెన్షనర్లు పాల్గొన్నారు.


పడాల వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో జరిగిన పెన్షనర్ల సమావేశ దృశ్యం

దోమల నివారణకు పాటుపడాలి

తణుకు అర్బన్: దోమ ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువని, దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. తణుకు మున్సిపాల్టీ పరిధిలోని సంజయ్ గాంధీ నగర్, బండి వారి వీధిలోని వార్డు సచివాలయాల ప్రాంతాల్లో డ్రైడే ఫ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ పుట్టుకను నివారించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతుందని ప్రజలు కూడా సహకరించాలని కోరారు. దోమలు విసర్జించే లార్వా 8 నుంచి 10 రోజులలోపు దోమగా మారుతుందని వారంలో ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ఇంటి ఆవరణల్లోని నీటి నిల్వలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోగలిగితే దోమలను నివారించవచ్చన్నారు. అనంతరం దోమల నివారణపై అవగాహన కల్పించేలా ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు వి.నిరోషా, డి.స్వర్ణకుమారి, శానిటేషన్ సెక్రటరీ లావణ్య, హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


తణుకులో డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వరరావు తదితరులు

నేడు విప్పర్రులో గడపగడపకు కార్యక్రమం

పెంటపాడు: మండలంలోని పడమరవిప్పర్రు గ్రామంలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం శనివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిధిగా పాల్గొనే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత దివ్యాంగుల పాఠశాలలో శుక్రవారం ప్రపంచ మస్తిష్క పక్షవాత దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్ దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 6వ తేదీన పక్షవాత దినోత్సవం నిర్వహిస్తున్నారని, 17 మిలియన్ల మంది ప్రజలు ఈ రుగ్మతతో బాధపడుతున్నారని తెలిపారు. చిన్న వయస్సులోనే గుర్తిస్తే వైకల్యం శాతం తగ్గించవచ్చునని వెల్లడించారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా అవసరమైన ఉపకరణాలు, ఫిజియోథెరపీ ఉచితంగా అందించబడతాయని, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.చంద్రకుమారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న డా.అల్లు శ్రీకృష్ణ మహేష్

జిల్లాకు నలుగురు ఫుడ్ ఇనస్పెక్టర్లను నియమించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజల ఆరోగ్యరీత్యా వెంటనే జిల్లాకు నలుగురు చొప్పున ఫుడ్ ఇనస్పెక్టర్లను నియమించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఏపీ స్టేట్ కన్స్యూమర్స్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఏఆర్‌కే హనుమంతరావు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కల్తీ నెయ్యి, కల్తీ పాలు, కల్తీ విత్తనాలు, కల్తీ ఆహార పదార్థాలు విచ్చలవిడిగా మార్కెట్‌లో అమ్ముతున్నారని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. డివిజన్‌కు ఒక ఫుడ్ ఇనస్పెక్టర్, మొబైల్ ఇనస్పెక్టర్ ఉండాలని సూచించారు. ఫుడ్ ఇనస్పెకర్ల సంఖ్యను పెంచడంతో పాటు వారికి మొబైల్ వాహనాలు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ, హెల్త్ కమీషనర్‌లకు లేఖలు రాసినట్లు ఆయన వివరించారు.

సంపూర్ణ పోషణతోనే ఆరోగ్యం


ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పెంటపాడు: ప్రభుత్వం తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం అందిస్తున్న సంపూర్ణపోషణను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీలు పేర్కొన్నారు. శుక్రవారం రావిపాడు గ్రామంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి, సుజాత, దుర్గాభవానిల ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన పోషణ కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, ఎంపీటీసీ సభ్యులు బొచ్చెల తాతారావు, పార్టీ నాయకులు పెన్నాడ రాఘవ, వింజమూరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, పూడి శ్రీనివాస్, ఈవోపీఆర్డీ ప్రసాద్, ఐసీడీఎస్ సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

సాక్షి, భీమవరం: పట్టణంలోని గునుపూడి గరువుపేటకు చెందిన మద్దా ఆశాకిరణ్‌ను కొట్టి గాయపర్చిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఏఎస్సై కె.శ్రీనివాసరావు తెలిపారు. కె.సూర్యప్రకాష్, జి.ప్రేమ్‌కుమార్‌లు గొడవ పడుతుండగా ఆశాకిరణ్ మోటార్ సైకిల్‌పై వెళ్తూ ప్రశ్నించినందుకు ప్రేమ్‌కుమార్ తన తండ్రితో కలిసి అతనిని కొట్టి గాయపర్చారు.